క్లుప్తంగా

తాగునీటి ట్యాంకర్ ప్రారంభం

కోడూరు: తీరప్రాంత ప్రజలకు ఉచితంగా తాగునీటిని సరఫరా చేసే వాటర్ ట్యాంకర్‌ను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శనివారం ప్రారంభించారు. జనసేన టౌన్ అధ్యక్షుడు కోట రాంబాబు ఆధ్వర్యాన జేకే ఇన్‌ఫ్రాతో ఉచితంగా తాగునీటి సరఫరాకు శ్రీకారం చుట్టారు. తొలిరోజు ఉల్లిపాలెం, హంసలదీవిలోని ఎస్సీ కాలనీలకు నీటిని అందించారు. అగ్నికుల క్షత్రియ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, పీసీ కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యం యోగ సాధనతో ఆరోగ్యం

చల్లపల్లి: నిత్యం యోగా సాధన చేస్తే చక్కని ఆరోగ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చని ఎంపీడీఓ వి.రవిశంకర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం యార్లగడ్డ, వక్కలగడ్డ, నడకుదురు సచివాలయాల యోగా ట్రైనర్లకు శిక్షణ ఇచ్చారు. యోగా గురువులు రామకృష్ణప్రసాద్, ఎస్.వెంకటేశ్వరరావు శిక్షణ ఇచ్చారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



అవనిగడ్డ: కోడూరు ఎస్సీకాలనీకి చెందిన పదోతరగతి మెరిట్ విద్యార్థి బత్తుల ప్రవల్లికకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా రూ.10 వేలు అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు పొందిన ఎస్సీ విద్యార్థులకు దివిసీమ భీమ్‌జీ అసోసియేషన్ నిర్వాహకుడు పోలాబత్తిన బిపిన్ చంద్రపాల్ ఆధ్వర్యంలో ఏటా ఒకరికి రూ.10వేలు నగదు ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. ఈ ఏడాది కోడూరు స్వతంత్ర్యపురం హైస్కూల్‌లో 578 మార్కులు సాధించిన బత్తుల ప్రవల్లికకు ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో బుద్ధప్రసాద్ నగదును అందించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పోలాబత్తిన గోపాలం, విద్యార్థిని తండ్రి రాజు పాల్గొన్నారు.

మృతులకు మాజీ ఎమ్మెల్యే నివాళి



చల్లపల్లి: జోగలాంబ గద్వాల్ జిల్లాలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చల్లపల్లికి చెందిన తల్లీకుమార్తెలు శ్రావణి, చైత్ర మరణించారు. వారి భౌతికదేహాలను చల్లపల్లికి తీసుకొచ్చారు. వారి భౌతికకాయాల వద్ద శనివారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సింహాద్రి రమేష్‌బాబు నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ శీరం వెంకట సత్యనారాయణ, నేతలు వెనిగళ్ల తారక జగదీష్, యడ్ల జగదీష్ ఇతర కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

పదో రోజుకు చేరిన అమలేశ్వరి జాతర

పెడన: దావోజిపాలెంలోని శ్రీ విజయ అమలేశ్వరిదేవి జాతర మహోత్సవాలు శనివారం పదో రోజుకు చేరాయి. భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చి అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకుంటున్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఆయన సోదరుడు కొనకళ్ల జగన్నాథరావు(బుల్లయ్య)లు అమ్మవారిని దర్శించుకున్నారు.

3న చినగొల్లపాలెంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

కృత్తివెన్ను: ప్రస్తుత కాలంలో పెరుగుతున్న క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి వ్యాధి నిర్ధారణ చేసేందుకు ముందస్తు పరీక్షల కోసం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు రేడియాలజీ డిపార్ట్‌మెంట్ అధికారి కె. అంజనీ కుమార్ తెలిపారు. మండల పరిధిలోని చినగొల్లపాలెంలో ఈ నెల 3వ తేదీ మంగళవారం ఉదయం నుంచి క్యాంపు జరుగుతుందన్నారు. మహిళల్లో వస్తున్న రొమ్ము, గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు వివరించారు. మహిళల కొరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ క్యాంపును మచిలీపట్నం భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ మరియు ఎంపీ లాండ్స్ ఫండ్స్‌తో నిర్వహిస్తున్నట్లు వివరించారు.

పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి పెట్టండి

కోడూరు: పారిశుద్ధ్య నిర్వహణపై పంచాయతీల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశించారు. కోడూరు సంతమార్కెట్ ప్రాంగణాన్ని శనివారం బుద్ధప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేసి అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎన్టీఆర్ భరోసా ద్వారా అందిస్తున్న పెన్షన్ పంపిణీలో బుద్ధప్రసాద్ పాల్గొన్నారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ సుధాప్రవీణ్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

పని భారంతో సతమతం

- కూటమి ప్రభుత్వ ఆదేశాలతో సచివాలయ కార్యదర్శులకు తప్పని తిప్పలు
- పని ఒత్తిడి
- అత్యవసర పనైనా దక్కని సెలవులు
- ఇచ్చిన పని ఎంతవరకూ వచ్చిందని కమిషనర్ ఫోన్‌తో టెన్షన్.. టెన్షన్..
- ఇండియన్ రెడ్‌క్రాస్‌కు చందాల పేరుతో వసూళ్లు!
- ఇదీ నగరంలోని సచివాలయ కార్యదర్శుల దుస్థితి



బందరులోని సచివాలయం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో పని చేస్తున్న కార్యదర్శులు పని భారంతో సతమతమవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో వలంటీర్ల వ్యవస్థ ఉండటంతో ఏ పనైనా కార్యదర్శులు వారితో చేయించేవారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వలంటీర్లను తొలగించింది. దీంతో నగరంలోని 50 డివిజన్‌ల్లో 50 సచివాలయాలు ఉన్నాయి. సుమారు 420 మంది వరకు కార్యదర్శులు పని చేస్తున్నారు. వీరందరూ వలంటీర్లు చేయాల్సిన పనులన్నింటినీ చేయాల్సిరావడంతో పని ఒత్తిడితో ఇబ్బంది పడుతున్నారు.

సర్వే హెచ్చరికలతో సతమతం

సాధారణ పనులే కాకుండా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాల సర్వేలను వీరే చేయాల్సివస్తోంది. ఈ సర్వేలు ఎంతవరకు వచ్చాయంటూ కమిషనర్ చేస్తున్న ఫోన్లతో వారిలో టెన్షన్ మరింత పెరిగి మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. 'ఈ ఉద్యోగంలోకి ఎందుకు వచ్చాంరా బాబూ..' అని పలువురు కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారంటే కూటమి పాలనలో వారిపై పని భారం ఏ మేర ఉందో అర్థమవుతోంది. ప్రస్తుతం యోగాంధ్రాకు సంబంధించిన సర్వేతే వారు మరింత ఇబ్బంది పడుతున్నారు. డివిజన్‌లోని ప్రతి వ్యక్తితో యోగాంధ్రా యాప్‌లో ఎన్‌రోల్ చేయించాలని ఇచ్చిన ఆదేశాలతో యోగాసనాలేమో కానీ మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఈ యాప్‌లో ఎన్‌రోల్ సమయంలో వచ్చే ఓటీపీ అడిగితే చాలా మంది ప్రజలు వీరికి చెప్పేందుకు అయిష్టత చూపుతున్నారు. ఈ పని లక్ష్యానికి దూరం కావటంతో అధికారుల మందలింపులు తప్పడం లేదు.

ప్రతి రోజూ వాట్సాప్ మెసేజ్‌లు

ఉదాహరణకు ప్రతి రోజూ కార్యదర్శులకు 'గౌరవ జాయింట్ కలెక్టర్ మేడం గారి టెలి కాన్ఫరెన్స్ వినండి... వెంటనే ఆచరించండి... ఉదయపు టీము లీడర్లు కూడా వినండి. ఆచరించండి.. ఈ రోజు ప్రతి సచివాలయంలో 500 రిజిస్ట్రేషన్స్ అవ్వాలి.. అందరూ ఈ పని మీద ఉండండి.. అందరూ ఫీల్డ్ లో ఇంటింటికీ తిరగండి.. ఈ వర్క్ సీరియస్‌గా చేయండి.. కృష్ణాజిల్లా ఇప్పటికీ కూడా అట్టడుగు స్థానంలో ఉంది.. మచిలీపట్నం నగరపాలక సంస్థ ప్రోగ్రెస్ లేకపోతే జిల్లా ఇంకా కింది స్థానంలోకి దిగుతుంది. ఈరోజు సాయంత్రం సీఎం ఆఫీస్ నుంచి టీసీ జిల్లా కలెక్టర్ గారికి జరుగుతుంది. ఆ లోపుగా మనం మంచి ప్రోగ్రామ్స్ చూపించాలి. వీలైతే నెంబర్ వన్ లో ఉండాలి.. రెడ్ జోన్‌లో ఉన్న సచివాలయ కార్యదర్శులు యాక్టివేట్ అవ్వాలి' అంటూ కమిషనర్ నుంచి వస్తున్న వాట్సాప్ మెసేజ్‌తో కార్యదర్శుల వెన్నులో వణుకు పుడుతోంది.

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి విరాళాలివ్వాలని హుకుం

నగరంలోని సచివాలయ కార్యదర్శులు ప్రతి ఒక్కరూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి విరాళాలను విధిగా ఇవ్వాలని అధికారులు హుకుం జారీ చేశారు. దీంతో ఓ పక్క పని ఒత్తిడితో ఇబ్బంది పడుతున్న కార్యదర్శులు ఈ విరాళాలు ఇచ్చేందుకు విముఖత చూపుతున్నారు. విధిలేని స్థితిలో కొంతమంది కార్యదర్శులు విరాళాలు ఇస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, డివిజన్ సచివాలయాల్లోని సెక్షన్ హెడ్స్, సీనియర్ అసిస్టెంట్స్, జూనియర్ అసిస్టెంట్స్ రూ. వెయ్యి, కార్యదర్శులు, ఇతర సిబ్బంది రూ. 500 విరాళాలను ఈ నెల 31వ తేదీ శనివారం లోపుగా నగరపాలక సంస్థ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు చెల్లించి రసీదు పొందాలని కమిషనర్ బాపిరాజు వాట్సాప్ మెసేజ్ పెట్టారు. ఈ విరాళాల కోసం కూడా తమపై ఒత్తిడి చేస్తున్నారని కార్యదర్శులు వాపోతున్నారు.

విరాళాలు ఇవ్వటంలో ఒత్తిడి లేదు

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అభివృద్ధికి ఉద్యోగులను విరాళాలు ఇవ్వాలని ఆ సంస్థ జిల్లా చైర్మన్, కలెక్టర్ కోరారు. దీంతో ఉద్యోగులకు సమాచారం ఇచ్చాం. ఏ ఉద్యోగి అయినా వారి ఇష్ట ప్రకారం విరాళాలు ఇవ్వొచ్చు, ఇవ్వకపోవచ్చు ఒత్తిడి లేదు. యోగాంధ్రా యాప్‌లో ఎన్‌రోల్‌మెంట్ ప్రభుత్వ నిర్ణయం. ఈ పనిని కార్యదర్శులు చేయాల్సిందే. నగరంలో దాదాపు 30 వేల మేర ఎన్‌రోల్ చేయాల్సిఉంది.

– సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, నగర కమిషనర్

అట్టహాసంగా శ్రీకృష్ణ దేవస్థానం పునర్నిర్మాణ పనులు



భూమి పూజల్లో మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు

మర్రిపాలెం(నాగాయలంక): గ్రామంలోని పూర్వ శ్రీకృష్ణ మందిరం స్థానంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో పునర్ నిర్మించ తలపెట్టిన శ్రీవర సిద్ధి వినాయక శ్రీఅభయాంజనేయ సమన్విత శ్రీరాధా రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామి నూతన దేవస్థానం పనులకు భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాలు శనివారం అట్టహాసంగా జరిగాయి. వేడుకకు హాజరైన అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సింహాద్రి రమేష్‌బాబు కొబ్బరికాయ కొట్టి నవధాన్యాలు సమర్పించారు. స్థానికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలంటూ డప్పు ప్రచారం




ప్రత్యేక వేషధారణలో డప్పు కొడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని ప్రచారం చేస్తున్న దాస్

చల్లపల్లి: విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడానికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కైతేపల్లి దాస్ మాస్టారు వినూత్న పద్ధతిలో ప్రచారం చేస్తూ తల్లిదండ్రులు, పిల్లల్ని ఆకర్షిస్తున్నారు. శనివారం ఆయన ప్రత్యేక వేషధారణలో డప్పు కొడుతూ ప్రభుత్వ పాఠశాలలతో కలిగే ప్రయోజనాలను వీధి వీధి తిరిగి ప్రచారం చేస్తున్నారు. ఆయనతోపాటు పాఠశాల ఉపాధ్యాయులు రాధారాణి, దుర్గాప్రసాద్ తదితరులు కూడా ప్రచారంలో పాల్గొన్నారు.

■ పరామర్శ

మచిలీపట్నం రూరల్: మండల పరిధిలోని బుద్దాలపాలెం గ్రామానికి చెందిన కృష్ణంరాజు సర్పంచ్‌గా, బ్యాంకు ప్రెసిడెంట్ గా సేవలందించిన వైఎస్సార్ సీపీ నేత వేగేశ్న కృష్ణంరాజు (90)ఇటీవల మరణించారు. శనివారం పార్టీ కృష్ణా అధ్యక్షులు, మాజీ మంత్రి పేర్ని వెంకటరామయ్య (నాని) శనివారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని వారి నివాసానికి వెళ్లి భార్య శాంతమ్మ, కుమారుడు ఉదయ భాస్కర రాజులను పరామర్శించి కృష్ణంరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో మచిలీపట్నం జెడ్పీటీసీ సభ్యుడు లంకే వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నార్త్ మండల అధ్యక్షుడు మట్టామోహన్ నాంచారయ్య, బుద్దాలపాలెం గ్రామ సర్పంచ్ దండుమోలు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

■ శతాధిక వృద్ధురాలు మృతి



ఘంటసాల: ఘంటసాల పెద్దగూడెం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు దిరిశం వజ్రమ్మ (101) శుక్రవారం మృతి చెందింది. శనివారం ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలు వజ్రమ్మకు ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. నాలుగు తరాల పిల్లలను చూడగా వజ్రమ్మ కుమారులు, కుమార్తెలు సంతానం మొత్తం 94 మంది ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

■ వరి, మినుము, చెరకులో నూతన రకాలు

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): వరి, మినుము, చెరకులో నూతన రకాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించాలని చెరకు పరిశోధనా స్థానం ప్రతినిధులు డాక్టర్ విజయభాస్కరరెడ్డి అన్నారు. మండలంలోని ఉత్తరచిరువోలులంకలో కేవీకే ఘంటసాల శాస్త్రవేత్తల ఆధ్వర్యాన శనివారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ వి.మంజువాణి, ఎంపీటీసీలు సనకా వెంకట రాజేష్‌బాబు, నడకుదుటి జనార్ధనరావు, పలువురు రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘంటసాల: ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం వికసిత క్రిషి సంకల్ప్ అభియాన్ ప్రోగ్రాం జరిగింది. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ డి.సుధారాణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

■ బందరు రూరల్‌లో 90 శాతం పింఛన్ల పంపిణీ

మచిలీపట్నంరూరల్: మండలంలో శనివారం 90 శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో చీపురుపల్లి వెంకటేష్ తెలిపారు. మొత్తం 11,765 మందికి 5, 26, 68,000 వేలు పంపిణీ చేయాల్సి ఉండగా శనివారం 10,515 మంది లబ్ధిదారులకు రూ.4,72,95,500 పంపిణీ చేశారు.

సంక్షిప్త వార్తలు

మచిలీపట్నంరూరల్: తాళ్లపాలెం పంచాయతీ పరిధిలోని స్నేహాలయ వృద్ధాశ్రమంలో శనివారం గనుల ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ డీకే బాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎస్పీ గంగాధరరావు, మెప్మా పీడీ సాయిబాబు, డీఆర్‌డీఏ హరిహరనాథ్, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: నగరంలోని చిలకలపూడిలో శనివారం మంత్రి రవీంద్ర లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, జిల్లా మార్కెటింగ్ కమిటీ చైర్మన్ బండి రామకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

■ రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

నందిగామటౌన్: పట్టణంలోని రైతుపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు..మచిలీపట్నంనకు చెందిన పెందుర్తి సాయికుమార్ (25) ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా శనివారం ద్విచక్రవాహనంపై నందిగామ వస్తుండగా లక్ష్మీప్రసన్న థియేటర్ సమీపంలో హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపు వస్తున్న టాటాఏస్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో సాయికుమార్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పోలీసుల స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

■ పోక్సో కేసులో వృద్ధుడి అరెస్ట్

కోనేరుసెంటర్: మచిలీపట్నంలో ఓ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన పోక్సో కేసులో వృద్ధుడు, విశ్రాంత పీఈటీ దేవేంద్రరావు అలియాస్ నటరాజ్‌ను ఇనగుదురుపేట పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. అనంతరం అతన్ని కోర్టులో హాజరు పరిచారు.

■ ఆర్జీయూకేటీ దరఖాస్తుల గడువు పొడిగింపు

మచిలీపట్నంఅర్బన్: రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్లో (ఆర్జీయూకేటీ) ప్రవేశాల దరఖాస్తుల స్వీకరణకు గడువు జూన్ 10వ తేదీ సాయంత్రం 5.00 గంటల వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి రామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు జూలై 2 వ తేదీ ఉదయం 10 గంటల www.rfuk-t.in వెబ్సైట్లో లేక ఏపీ ఆన్లైన్ కేంద్రంలో దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

పొగాకు.. అనర్థాలపై అవగాహన

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం పొగాకు వ్యతిరేక దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ సేవాపథకం యూనిట్ 1 అధికారి డాక్టర్ వీరాకుమారి మాట్లాడుతూ పొగాకు తాగితే మానవుల్లో కలిగే అనర్థాలను వివరించారు. దీనిపై అభిప్రాయ సేకరణ చేశారు. ఈ సందర్భంగా సిగరెట్ తాగితే కలిగే అనర్థాలను ప్రాక్టికల్‌గా చూపించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారిపై దాడి

కోనేరుసెంటర్: గుర్తుతెలియని వ్యక్తులు ఓ వడ్డీ వ్యాపారిపై కర్రలతో దాడి చేశారు. ఘటనపై ఇనగుదురుపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. మచిలీపట్నం కాలేఖాన్‌పేటకు చెందిన నాగిశెట్టి సాయిప్రసాద్ నగరంలో పాల వ్యాపారంతో పాటు వడ్డీ వ్యాపారం చేస్తుంటాడు. శుక్రవారం రాత్రి మూడు గంటల సమయంలో గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు ముసుగు వేసుకుని సాయిప్రసాద్ తలుపు తట్టారు. అతను బయటికి రాగా నలుగురు వ్యక్తులు కర్రలు, రాడ్లతో దాడి చేసి తల పగలకొట్టారు. అతను కేకలు పెట్టడంతో భార్య బయటికి వచ్చి అడ్డుపడింది. ఆ నలుగురు ఆమెను కర్రలు, రాడ్లతో కొట్టారు. భార్యభర్తలిద్దరూ కేకలు పెట్టడంతో దాడి చేసిన వారు పరారయ్యారు. సాయిప్రసాద్ తలకు బలమైన గాయం కావటంతో పాటు తీవ్ర రక్తస్రావమైంది. చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో బాధితుడిని విజయవాడ తరలించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పరమేశ్వరరావు తెలిపారు.

'మిత్ర' మెటీరియల్ పంపిణీ

మోపిదేవి: మోపిదేవి ఆదర్శ విద్యాలయంలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర మెటీరియల్‌ను ఆయా పాఠశాల ఉపాధ్యాయులకు ఎంఈవో అన్నపరెడ్డి పిచ్చయ్య శనివారం అందజేశారు. ఉదయం పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో 2025-26 విద్యాసంవత్సరానికి విద్యార్థుల యూనిఫాం, బెల్టులు, నోట్‌బుక్స్, టెక్స్ట్‌బుక్స్, డిక్షనరీలు స్టాక్ పాయింట్ నుంచి అన్ని పాఠశాలలకు పంపిణీ చేసినట్లు ఎంఈవో తెలిపారు. 2025 విద్యాసంవత్సరంలో ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా మండలానికి కొత్తగా ముగ్గురు ప్రధానోపాధ్యాయులు వచ్చినట్లు ఎంఈవో అన్నపరెడ్డి పిచ్చయ్య తెలిపారు.

శ్రీనివాసరావు సేవలు అభినందనీయం



శ్రీనివాసరావును సత్కరిస్తున్న దృశ్యం

కోడూరు: కోడూరు ఎంఈఓ-2గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన విశ్వనాథపల్లి శ్రీనివాసరావు సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ సభను శనివారం స్థానిక దానశక్తి ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో నిర్వహించారు. సభలో బుద్ధప్రసాద్, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఎమ్మెల్సీ కల్పలత, అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, పీసీ కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు పాల్గొని శ్రీనివాసరావు దంపతులను సన్మానించారు. అనంతరం శ్రీనివాసరావు దంపతులను బుద్ధప్రసాద్, రమేష్‌బాబు, కల్పలతలు వేరువేరుగా సత్కరించారు. ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు, ఎంపీడీఓ సుధాప్రవీణ్, ఎస్ఐ చాణిక్య, వివిధ శాఖలాధికారులు, రాజకీయ పార్టీల నేతలు, విద్యాకుటుంబం సభ్యులు శ్రీనివాసరావు దంపతులను సన్మానించారు.

నిబద్ధతతో పని చేస్తే గుర్తింపు



గోపాలకృష్ణారెడ్డి ఉద్యోగ విరమణ సభలో ఎంపీడీఓ సుధాప్రవీణ్, సిబ్బంది

కోడూరు: వృత్తిలో నిబద్ధతతో పని చేస్తే సమాజంలో గుర్తింపు వస్తుందని ఎంపీడీఓ సుధాప్రవీణ్ అన్నారు. మండలంలోని విశ్వనాథపల్లి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న మల్లిడి గోపాలకృష్ణారెడ్డి ఉద్యోగ విరమణ సభను శనివారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించారు గోపాలకృష్ణారెడ్డి దంపతులను మండల పరిషత్ తరఫున శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించారు. ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు గోపాలకృష్ణారెడ్డి సేవలను ప్రశంసించి, సత్కరించారు. ఈఓపీఆర్డీ నాగరేవతి, విశ్వనాథపల్లి సర్పంచి కొప్పనాతి శేషుబాబు, కార్యదర్శులు బొలిశెట్టి శేషగిరిరావు పాల్గొన్నారు.

చెన్నూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు నగదు పురస్కారం



మాట్లాడుతున్న వరప్రసాద్ తదితరులు

పెడన: చెన్నూరు గ్రామానికి చెందిన వరప్రసాద్, ధనుంజయ్, నరేష్ తమ తల్లిదండ్రులు, సోదరి పుప్పాల నరసింహారావు, లీలావతి, పద్మల జ్ఞాపకార్థం 2024-25 పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన చెన్నూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు నగదు పురస్కారాలను అందజేశారు. శనివారం జరిగిన కార్యక్రమంలో సదరు విద్యార్థులను సన్మానించి నగదు పురస్కారాలను ఇచ్చారు. జిల్లాలోనే అత్యుత్తమ మార్కులు సాధించిన పుప్పాల బోవనేశ్వరి (589) ప్రథమ బహుమతిగా రూ.20వేలు అందజేశారు. రెండవ స్థానం సాధించిన యర్రంశెట్టి జాహ్నవి (582)కి రూ.15వేలను ద్వితీయ బహుమతిగా అందజేశారు. తృతీయ స్థానం సాధించిన కొండవీటి రేవతి(579)కి రూ.10వేలు నగదును బహుమతిగా ఇచ్చారు. విశ్రాంత హిందీ ఉపాధ్యాయులు అనంత వెంకటేషన్ ఈ ముగ్గురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున రూ.30వేలు క్యాష్ ప్రైజ్ ఇచ్చారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ భాష్యం ఈ విద్యార్థులకు రూ.1,116 చొప్పున అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిద్దినేని సౌజన్య, యాజమాన్య కమిటీ చైర్మన్ ఉద్దగిరి రాఘవులు, పాఠశాల టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.



మీరు నడవగలరుగా..
ఒక చోటకు అందరూ వస్తే ఇచ్చేస్తా...

సామాజిక పింఛన్లను శనివారం లబ్ధిదారులకు బిరిస్ తీసుకుని సచివాలయ ఉద్యోగులు అందజేశారు. మీరంతా నడవగలరుగా.. ఒక చోటకు వస్తే అందరికీ ఇచ్చేస్తా.. నేను రావాలంటే సమయం పడుతుందని సచివాలయ ఉద్యోగుల్లో కొందరు లబ్ధిదారులతో అంటున్న మాటలివి. కొందరు ఇళ్లకు వెళ్లి ఇస్తుంటే మరికొందరు ఒక ప్రాంతాన్ని ఎంపిక చేసి అక్కడికే పింఛనర్లను రమ్మని చెబుతూ పెన్షన్లు ఇస్తున్నారు. ఇలాంటి దృశ్యాలు పెడన మండలం లంకలకలువగుంటలో కనిపించాయి. – పెడన

కూటమి నేతలకు వెన్నుపోటు వెన్నతో పెట్టిన విద్య

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు సుబ్బన్న



వెన్నుపోటు కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పేర్ని కిట్టు, పార్టీ నాయకులు

కోనేరుసెంటర్: టీడీపీ కూటమి నేతలకు వెన్నుపోటు అనేది వెన్నతో పెట్టిన విద్య అని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మేకల సుధాకర్(సుబ్బన్న) అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఈ నెల 4వ తేదీన పార్టీ ఆధ్వర్యాన తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌లను నియోజకవర్గ సమన్వయకర్త పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)తో కలిసి పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్బన్న మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీలు నీటిమూటలయ్యాయన్నారు. కూటమి అన్యాయాన్ని ఎండగడుతూ ఈ నెల 4న వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నగర ఉపాధ్యక్షుడు గూడవల్లి నాగరాజు, సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ శీలం మారుతీరావు (బాబ్జి) మాట్లాడుతూ వెన్నుపోటుదినాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆ రోజు ఉదయం జిల్లా కోర్టు సెంటర్‌లోని పార్టీ కార్యాలయం నుంచి శాంతియుత ర్యాలీ చేస్తామన్నారు. అన్ని వర్గాలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మీర్ అజ్గర్‌అలీ, కొలుసు హరిబాబు, మహమ్మద్‌సాహెబ్, రమేష్‌బాబు, కాగిత జవహర్‌లాల్‌నెహ్రూ, గాజుల భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అంకితభావంతో..



చిలకలపూడి(మచిలీపట్నం): ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో అటెండర్‌గా సేవలు అందిస్తూ నాగరాజు అందర్ని ఆకట్టుకునేవాడని, అంకితభావంతో పని చేసేవాడని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో అటెండరుగా పనిచేసి శనివారం పదవీ విరమణ చేసిన సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ డీకే బాలాజీ.. నాగరాజును శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మంగినపూడి (మచిలీపట్నం రూరల్): యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని రాష్ట్ర గనుల, ఎస్ భూగర్భవనరుల, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం మంగినపూడి బీచ్‌లో 1000 మందితో యోగాంధ్ర 2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలందరూ యోగాను బరువుగా భావించకుండా 21 రోజులపాటు క్రమం తప్పకుండా సాధనం చేయడం ద్వారా జీవనశైలిలో భాగమైపోతుందన్నారు. యోగా శిక్షకులు శిరీష వేదికపై చేసిన పలు యోగాసనాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ కె.నారాయణ, డీఆర్వో చంద్రశేఖరరావు, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, బందరు ఆర్డీవో స్వాతి తదితరులు పాల్గొన్నారు.